క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ చాంద్ బాషా

పులివెందుల రూరల్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ చాంద్ బాషా హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కొత్తపల్లె, ఎర్రిపల్లె, నల్లపురెడ్డిపల్లె గ్రామాల్లో ప్రజలకు సీఐ చాంద్ బాషా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చాంద్ బాషా మాట్లాడతూ ప్రజలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే నాటుసారా, బెల్టు షాపులు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



సీపీఐ మండల కార్యదర్శి అమీర్

సింహాద్రిపురం : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ మండల కార్యదర్శి అమీర్ బాషా తెలిపారు. మండలంలోని అంకాలమ్మగూడూరులోని స్థానిక కల్యాణ మండపంలో సీపీఐ నాయకుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శిగా అమీర్ బాషాను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అనంతరం అమీర్ బాషా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నామని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట రాములు, బ్రహ్మం, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పేపర్ గ్లాసులు వినియోగించకూడదు



టీ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ రాముడు సిబ్బంది

పులివెందుల టౌన్ : క్యాన్సర్‌కు కారణమయ్యే పేపర్ గ్లాసులను ఉపయోగించరాదని మున్సిపల్ కమిషనర్ రాముడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టీ, కాఫీ షాపులతోపాటు కర్రీస్ పాయింట్లను సచివాలయ శానిటరీ సెక్రటరీలతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐఎస్ఐ మార్క్ కలిగిన టీ, కాఫీ పొడులనే వాడాలని షాపు యజమానులకు సూచించారు.

వర్మీ కంపోస్ట్‌తో నాణ్యమైన పంటలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

పులివెందుల టౌన్ : వర్మీ కంపోస్ట్ ఎక్కువగా వాడి నాణ్యమైన పంటలను పండించవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు వర్మీకల్చర్, వర్మీ కంపోస్ట్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు వర్మీ కంపోస్ట్ తయారీ, ఉపయోగాల గురించి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాల నారాయణ, అధ్యాపకులు జనార్దన, శ్రీనిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

రుతు క్రమంలో పరిశుభ్రత తప్పనిసరి



మాట్లాడుతున్న సీహెచ్ఓ దేవి

వేంపల్లె : రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించడంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీహెచ్ఓ దేవి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ దేవి మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత లేకపోతే వివిధ రకాల క్యాన్సర్లకు గురి కావాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఓబుల్ రెడ్డి, మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు కిరణ్మయి, నాగలక్ష్మీదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ!

- నెరవేరని 'కూటమి' హామీలు
- పరిహారం అందక.. ప్రజల పాట్లు
- గండికోట నిర్వాసితుల ఆవేదన



గండికోట ప్రాజెక్ట్ వద్ద మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే అదినారాయణరెడ్డి (ఫైల్)

కొండాపురం : గండికోట ప్రాజెక్ట్ నిర్వాసితులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. జలాశయం మొదటి విడత 14 గ్రామాల నిర్వాసితులకు రూ. 3 లక్షల 25వేల రూపాయల అదనపు పరిహారంతో పాటు మరో రూ. 2 లక్షల రూపాయలు కలిపి ఇస్తామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. గెలిచిన తరువాత 90 రోజుల్లో ఇస్తామన్న హామీని ఆయన ఇప్పటికీ నెరవేర్చలేదు. ప్రతి సమావేశంలో తొందరలో పరిహారం వస్తుందని చెబుతూ నిర్వాసితులతో చెప్పట్లు కొట్టించుకోవడమే తప్పా.. నేటికి పరిహారం ఇవ్వలేదు. 14 ముంపు గ్రామాల్లో మొదటి విడతలో 9,096 మంది నిర్వాసితులుగా ఉండగా.. 7 వేల మందికి పరిహారం చెల్లించి 2 వేల మందికి పరిహారం చెల్లించలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో పరిహారం పంపిణీలో అర్హులకు ఇవ్వకుండా అనర్హులకు చెల్లించారని అప్పటి ఆర్డీఓ వినాయకంను సస్పెండ్ చేశారు. విచారణ తరువాత ఆ పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. తరువాత నిర్వాసితులకు మొత్తం పరిహారం చెల్లించినట్లు అధికారులు నివేదికలిచ్చారు. గండికోట ప్రాజెక్ట్‌లో భూములు, ఇళ్లు కోల్పోయి స్థానిక పునరావాస కేంద్రాల్లో చోటు కల్పించకపోవడంతో తల దిక్కు వెళ్లిపోయారు. ఇప్పుడు నిర్వాసితులు ఆర్డీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలు లేక ఇక్కట్లు

గండికోట జలాశయంలోని మొదటి విడత గ్రామాలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో కొండాపురం, దత్తాపురం, చౌటిపల్లి మిగతా పునరావాస కాలనీల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు నిర్మించపోవడంతో 15 సంవత్సరాలుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దత్తాపురం పునరావాస కాలనీలో సీ– బ్లాక్‌లో బుక్కపట్నం ప్రాథమిక పాఠశాల భవనం లేక హైస్కూల్ పాఠశాలలోని నూతన వంటశాలలో బోధన నిర్వహిస్తున్నారు. దరువుపల్లె ప్రాథమిక పాఠశాల భవనం లేకపోవడంతో స్థానిక వ్యక్తి విద్యార్థుల అవస్థలు చూడలేక ఓ చిన్న గదిని ఇచ్చాడు. ఆ గది సరిపోకపోవడంతో ఉపాధ్యాయులు సొంత నిధులతో రేకుల షెడ్డును నిర్మించి తరగతులు నిర్వహిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు– నేడు పథకం ద్వారా ఆ రెండు గ్రామాల ప్రభుత్వ పాఠశాలకు భవనాలు మంజూరు చేశారు. ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంపై స్థానిక టీడీపీ మద్దతుదారుడు కోర్టుకు వెళ్లడంతో భవనాలు నిర్మించలేకపోయారు. మొదటి విడత గ్రామాలతో పాటు మిగతా గ్రామాలకు కొండాపురంలో 547 మందికి రూ. 53.86 కోట్లు పరిహారం కేటాయించాల్సి ఉంది. మిగతా గ్రామాల లబ్ధిదారులు అదనపు పరిహారం కోసం వేచి చూస్తున్నారు. ఈ విషయమై జమ్మలమడుగు ఆర్డీఓ అదిమూలం సాయిశ్రీ వివరణ కోరగా ఆమె స్పదించలేదు.

అదనపు పరిహారం ఇవ్వాలి



గండికోట ప్రాజెక్ట్‌లో నీళ్ల నింపడంతో గ్రామంలో ఇళ్లు ఖాళీచేసి చౌటిపల్లి పునరావాస కాలనీలో చేరాం. ఇక్కడ ఉపాధి లేక అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం స్పదించి అదనపు పరిహారం మంజూరు చేయాలి – ఎ.రాంభూపాల్‌రెడ్డి, చౌటిపల్లి గ్రామం

ఎదురుచూస్తున్నాం



గత టీడీపీ ప్రభుత్వంలో పరిహారం పంపిణీలో మా గ్రామంలో 150 మంది నిర్వాసితులకు పరిహారం చెల్లించలేదు. స్థానికంగా అధారాలున్నా.. సోషియల్ ఏకానమీ సర్వేలో అర్హులుగా గుర్తించలేదు. అదనపు పరిహారం తొందరగా మంజూరు చేయాలని కోరుతున్నాం. పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం. – ఎల్లా శేఖర్‌రెడ్డి, దత్తాపురం

ఎదురుచూపులు

- రాజోలికి పరిహారం హామీ అమలు ఎప్పుడో?
- ఎకరాకు 24లక్షలు ఇస్తామన్నారు
- ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న అందని పరిహారం



రాజోలి ఆనకట్ట

జమ్మలమడుగు : రాజోలి ఆనకట్ట నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రకటించిన రూ.12 లక్షలకు మరో రూ. 12 లక్షలు కలిపి మొత్తం రూ. 24లక్షలు తాము అధికారంలోకి వస్తే ఇస్తామని మంత్రి లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా పెద్దముడియంలో ప్రకటించారు. అలాగే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కూడా రాజోలి ముంపు గ్రామాల రైతులకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు రాజోలి ముంపు పరిహారం ప్రకటించలేదు. రాజోలిపై మూడు టీఎంసీల నీరు నిల్వ ఉండే విధంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శంకుస్థాపన చేశారు. రాజోళి ఆనకట్ట ఒక టీఎంసీ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే విధంగా ప్రతిపాదనలు పెట్టారు.

2,219 ఎకరాల భూమి సేకరణ

రాజోలి ప్రాజెక్టు నిర్మాణం కోసం అధికారులు నంద్యాల జిల్లా గొట్లూరు, పెద్దముడియం మండలంలోని బలపనగూడురు, ఉప్పలూరు, జె.కొత్తపల్లి, జంగాలపల్లి, చిన్నపసుపల గ్రామాల్లో 2,219 ఎకరాల సేకరణకు ప్రతిపాదన పెట్టారు. అందులో 1,754 ఎకరాలకు అవార్డు ప్రకటించారు. అవార్డు ప్రకటించిన భూములకు సంబంధించిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు వర్తించడం లేదు. బ్యాంకు నుంచి రుణాలు పొందాలన్నా ఆన్‌లైన్‌లో వన్‌బీలు రావడంలేదంటూ రైతులు వాపోతున్నారు. అవసరాలకు తమ భూములను అమ్ముకోవాలన్నా.. అమ్ముకోలేని పరిస్థితి ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం ఇవ్వాలి



నాకు 7.5 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం తమ భూములు ఆన్‌లైన్‌లో రిజిస్టర్లు కావడంలేదు. ఏడాది దాటినా తమకు ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం ఇవ్వలేదు. అవార్డులు చేసినారే తప్పా.. తమకు పరిహారం ఇవ్వలేదు. వెంటనే పరిహారం ఇవ్వాలి. – అచ్యుతానందరెడ్డి, బలపనగూడురు, పెద్దముడియం మండలం

24 లక్షలు చెల్లించాలి



రాజోలి నిర్మాణం కోసం తమ భూములు అవార్డులు అయ్యాయి. ఎన్నికల సమయంలో రాజోలి ఆనకట్ట కింద ముంపునకు గురైన భూములకు ఎకరాకు 24 లక్షల రూపాయలు ప్రకటించారు. రైతులకు పరిహారం వెంటనే పరిహారం చెల్లించాలి. రాజోలి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి. – సుదర్శన్‌రెడ్డి, గరిశలూరు గ్రామం, పెద్దముడియం

సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయుడు



ఉపాధ్యాయుడు నజీరుద్దీన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేంపల్లె : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని పాఠశాల హెడ్మాస్టర్ శివ మునెమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు నజీరుద్దీన్ తాహిర్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు నజీరుద్దీన్ తాహిర్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ శివమునెమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నజీరుద్దీన్ తాహిర్‌కు ఇంకా నాలుగేళ్లపాటు సర్వీస్ ఉన్నప్పటికీ ఆరోగ్య సమస్యలు రీత్యా విద్యా బోధన చేయడం కష్టంగా భావించి రిటైర్డ్‌మెంట్ తీసుకున్నారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు నజీరుద్దీన్ తాహిర్ తోటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఉద్యమం తప్పదు



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు : ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే మరో విద్యుత్ పోరాటం తప్పదని, వెంటనే స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ నాయకుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల విడుదల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు,వామపక్షాలు వ్యతిరేకించాయన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు పగల కొట్టాలని పిలుపు ఇచ్చారని, మరి ఇప్పుడు ఎందుకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారో లోకేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి ట్రూ అప్, ఇంధన చార్జీల పేరుతో వేలకోట్లు వసూలు చేసిందని, స్మార్ట్ మీటర్లు కూడా పెడితే ప్రజల మెడకు ఉరితాళ్లుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. భవిష్యత్‌లో విద్యుత్ రంగం మొత్తం అదానీ చేతికి వెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దండు రవి తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి సహకరించండి



కమలాపురం కమిషనర్ (ఎఫ్ఏసీ) రాంబాబు

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కమలాపురం పంచాయతీ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా రాంబాబు కోరారు. కమలాపురం పంచాయతీ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా రాంబాబు బాధ్యతలు చేపట్టారు. కడప కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న రాంబాబును కమలాపురం కమిషనర్ (ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో గురువారం ఆయన కమలాపురంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తికి కృషి చేస్తానన్నారు. అలాగే నగర పరిధిలోని నివాసితులు ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు. కాగా ఇక్కడ కమిషనర్‌గా పని చేస్తున్న పగడాల జగన్నాథ్ రెండు నెలల క్రితం అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

వైఎస్ జగన్‌ను చూస్తే భయమెందుకు?

పులివెందుల రూరల్ : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పలువురిని పరామర్శించేందుకు వెళుతుంటే కూటమి నాయకులకు భయమెందుకని వైఎస్సార్‌సీపీ నూర్ బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ ప్రశ్నించారు. గురువారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలనలోనే జగన్ ఎక్కడికి వెళ్లినా ప్రజలు, అభిమానులు భారీ సంఖ్యలో వస్తున్నారన్నారు. అభిమానులు, కార్యకర్తలు రాకుండా అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం పోలీసులతో ఎన్నడూ లేనివిధంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌ను చూసేందుకు అభిమానులు, కార్యకర్తలు విపరీతంగా వస్తున్నారని, వారిని ఎవరూ ఆపలేరన్నారు. కూటమి సర్కార్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్ జగన్‌పై ప్రజలకు ఉన్న అభిమానాన్ని ఎవరూ చెరిపేయలేరని తెలిపారు.

ఉల్లి రైతుల్లో ఆందోళన



తొండూరు ఆన్‌లైన్ సెంటర్ వద్ద ప్రీమియం చెల్లించేందుకు వేచి ఉన్న ఉల్లి రైతులు

తొండూరు : ఖరీఫ్‌లో రైతుల పంటలకు ప్రీమియం చెల్లించేందుకు గడువు ముగుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారంతో ఉల్లి పంటలకు బీమాకు సంబంధించి ప్రీమియం గడువు ముగుస్తుండటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఆన్‌లైన్ కేంద్రాల వద్దకు రైతులు గుంపులు గుంపులుగా వెళ్లి బారులు తీరినా సర్వర్ పనిచేయకపోవడం, గంటకు ఒక రైతుకు సంబంధించిన వివరాలు పొందుపరుస్తుండటంతో రైతులు పంటల బీమా ప్రీమియం గడువు పెంచాలని కోరుతున్నారు. మరికొంతమంది రైతుల ఖాతాలు ఆన్‌లైన్ కనిపించకపోవడంతో ఒక వైపు గడువు ముగియడం, మరోవైపు ఖాతాలు కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉల్లి పంట ప్రీమియం గడువు పెంచాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఏఓను వివరణ కోరగా ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని వివరించారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని స్థానిక కడప రోడ్డు నరసారెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి పెట్రోల్ బంక్ సమీపాన వసుంధర ట్రేడ్‌ఫేర్ ఎగ్జిబిషన్‌ను గురువారం వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్ మధురెడ్డికి ఎగ్జిబిషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పెద్ద జేయింట్ వీలు ఉయ్యాలను ప్రారంభించారు. నూర్ బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ డ్రాగన్ ట్రైన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి బ్రేక్ డ్యాన్స్ ఉయ్యాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌కు వచ్చే ప్రజలకు, పిల్లలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షబ్బీర్, కౌన్సిలర్లు పురుషోత్తం, ఖాదర్ బాషా, కో–ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, ఎగ్జిబిషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని జె.కొత్తపల్లి జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు మేకల శివార్జున, ఆకుమళ్ల రాజబాబు (బీటీయూఏపీ), రామచంద్రారెడ్డి (ఏపీటీఎఫ్) మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పాఠశాల సహాయకులు, జూనియర్లు అయినప్పటికీ, వారిని ఎంఈఓ–1లుగా నియమించడం దురదృష్టకరమని, ఇది సమంజసం కాదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అలా నియమించిన వారిని వెంటనే వెనక్కి పంపించాలని కోరారు. పంచాయతీరాజ్ పాఠశాలల్లో ఎన్నో వేలమంది ప్రధానోపాధ్యాయులు ఉండగా, వారిని కాదని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పాఠశాల సహాయకులను ఎంఈఓ–1లుగా నియమించడం పంచాయతీరాజ్ శాఖ ఉపాధ్యాయులను అవమానించడమేనని పేర్కొన్నారు. ఈ ఉపాధ్యాయులు గంగాధర్, అబ్దుల్ అజీజ్, శంకరరెడ్డి, వెంకటసుబ్బయ్య, సునీత, లత,వందన పాల్గొన్నారు.

3న జాబ్ మేళా

లింగాల : మండల కేంద్రమైన లింగాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 3వ తేదీన ఆదివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో పలు కార్పొరేట్ సంస్థలు పాల్గొననున్నాయని, ఇప్పటికే ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు తమ ట్రేడుల ప్రకారం ఇందులో పాల్గొని ఉద్యోగ అవకాశాలను పొందాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో హాజరై ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంఈఓగా ఖాదర్ బాషా

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండల ఎంఈఓ–1గా గురువారం ఖాదర్ బాషా బాధ్యతలు చేపట్టారు. ఈయన పులివెందులలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఖాదర్‌బాషాను సింహాద్రిపురం ఎంఈఓగా నియమిస్తూ కడప ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఖాదర్ బాషా ఎంఈఓ–1గా బాధ్యతలు స్వీకరించారు.

ఎంఈఓ–1గా విశ్వనాథరెడ్డి

లింగాల : లింగాల మండలం ఎంఈఓ–1గా విశ్వనాథరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–1 విశ్వనాథరెడ్డిని ఎంఈఓ–2 రామకృష్ణయ్య కలిసి అభినందనలు తెలిపారు. ఎంఈఓ విశ్వనాథరెడ్డిని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నాయకులు వెంకటనాథరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, మదార్‌వల్లి, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డిలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం

జమ్మలమడుగు రూరల్ : జైలులో ఉండే ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్. భార్గవి తెలిపారు. గురువారం పట్టణంలోని సబ్ జైల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తప్పు చేసిన జైల్ జీవితం గడిపి వెళ్లిన తరువాత ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, సౌకర్యాల గురించి ఆరాతీశారు. జైల్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

- హామీలను నిలదీయాలి
- నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజనేయరెడ్డి



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

చింతకొమ్మదిన్నె : అధికారం కోసం సాధ్యంకానీ హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గోపలాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, మోహనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ సంక్షేమ పథకాలకు, సమగ్రాభివృద్ధికి కేరాఫ్‌గా ఉండేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పరిపాలనలో సంక్షేమ పథకాల ఊసే లేదని తప్పుబట్టారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అంటూ ఇంటింటికి తిరిగి క్యూఆర్ కోడ్ కలిగిన కరపత్రాలు పంచుతూ గత ప్రభుత్వ పరిపాలనకు ,ప్రస్తుత ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ఆయన ప్రజలకు వివరించారు.

మాట తప్పిన కూటమి నేతలు

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ. 20 వేలు నగదు జమ చేస్తానని చెప్పి.. ఇప్పుడు మాట తప్పారని నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు . ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టిస్తానని చెప్పి ఇంతవరకు దానిపై చర్చించలేదని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. కరెంట్ చార్జీలు పెంచడంపై ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం ఇంటి వద్దకే వచ్చేవని, ఇప్పుడు రేషన్ షాపుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏ రాష్ట్రంలో అమలుకానీ సంక్షేమ పథకాలు ఏపీలో అమలు చేశారని గుర్తుచేశారు. సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి నేడు రకరకాల కారణాలు చూపుతూ అవి కూడా సరిగా అమలు చేయలేక ప్రజలను సంక్షేమ పథకాలకు దూరం చేస్తూ పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సంపద సృష్టించి పంచుతానని చెప్పిన చంద్రబాబు తన సంపద పెంచుకుంటున్నారని విమర్శించారు. తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. నమ్మించి నిండా ముంచిన చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు ప్రభాకరరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి బుసిరెడ్డి నారాయణరెడ్డి, కంచన జయరాం, కోదండరాం, బాల గంగయ్య, మల్లెంబాబు,రమణారెడ్డి, శశికుమార్, సత్యం, శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

బాబు హామీలన్నీ గాలి మాటలే

పెండ్లిమర్రి : అధికారం కోసం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గాలి మాటలుగానే మారాయని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి ఎద్దేవాచేశారు. గురువారం సాయంత్రం మండలంలోని రామచంద్రాపురం, ఇందిరానగర్, శాంతినగర్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు ఆరితేరిపోయారని విమర్శించారు. అనంతరం ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రతి కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో ప్రజలకు గుర్తు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రహాసురెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల మాజీ చైర్మన్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, రమణ, నాగిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చావలి శివ, పాల్గొన్నారు.